క్లుప్తంగా

పౌరహక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

గరుగుబిల్లి: పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు యువతకు, ప్రజలకు వివరించారు. మండలంలోని గొట్టివలసలో పౌరహక్కులపై అవగాహన సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులందరికీ సమాన హక్కులు కలిగి వుంటాయన్నారు. అన్ని మతాలకు, వర్గాలకు సమాన హక్కులుంటాయన్నారు. అంటరానితనం తదితర అంశాలను ప్రజలకు అవగాహన కలిగి వుండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కులవివక్ష చూపితే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతీ ఒక్కరూ అనుభవిస్తూ ఇతరులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శిగా చిన్నయ్య

బాదంగి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శిగా మండలంలోని రేజేరు గ్రామానికి చెందిన రాజాన చిన్నయ్య నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడినట్లు ఆయన తెలిపారు. తనకు ఈ పదవి రావడంలో కృషి చేసిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడులకు కృతజ్ఞతలని, అంతకంటే ముందు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని ఆయన అన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఆలయాలకు వితరణ

చీపురుపల్లి: పట్టణంలోని 18 ఆలయాలకు పట్టణవాసి కిల్లంశెట్టి సన్యాసిరావు తన తల్లిదండ్రులు ఆంజనేయులు, లక్ష్మీకుమారి జ్ఞాపకార్థం రూ.30 వేల విలువైన ట్యూబ్‌లైట్ సెట్లు, ఎల్‌ఈడీ బల్బులను ఆదివారం వితరణ చేశారు. స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఈఓ బి.శ్రీనివాస్‌కు ట్యూబ్‌లైట్ సెట్లు, ఎల్‌ఈడీ బల్బులు అందజేశారు. కార్యక్రమంలో గవిడి నాగరాజు, అద్దూరి సీతబాబు, వలిరెడ్డి రవీంద్రనాయుడు, బలగ రామారావు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, సూరు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు

శృంగవరపుకోట: స్థానిక ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారుల మధ్య చీఫ్‌కోచ్ పి.శ్రీరాములు ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలను ఆదివారం నిర్వహించారు. క్రీడాకారులను సబ్ జూనియర్, జూనియర్, సీనియర్లుగా విభజించి సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీలు ఉత్సాహంగా సాగాయి. చిన్నారులు అయిన క్రీడాకారుల మధ్య పోటీతత్వాన్ని పెంచేందుకు, క్రీడల పట్ల మక్కువ పెంచేందుకు ఈ పోటీలు ఏర్పాటు చేసినట్టు చీఫ్‌కోచ్ శ్రీరాములు చెప్పారు. రెండు రోజులు పాటూ ఈ పోటీలు నిర్వహించి విజేతలకు రంజాన్ సందర్భంగా సోమవారం సాయంత్రం బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు.

నేడు బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం

బొండపల్లి: మండల కేంద్రంలో బంగారమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఇప్పటికే కమిటీ అన్ని ఏర్పాట్లు చేశామని, అమ్మవారి ఆలయంతో పాటు విగ్రహానికి రంగులు వేసి ముస్తాబు చేశామన్నారు. సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తామని, భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.


సీతానగరం: రామాలయంలో పంచాంగ శ్రవణం


పార్వతీపురం టౌన్ రామాలయంలో సామూహిక పూజలు చేస్తున్న భక్తులు


పార్వతీపురం టౌన్ వైకేఎం కాలనీలో శ్రీరామ కళ్యాణానికి ముహూర్తపు రాటను వేస్తున్న భక్తులు


పార్వతీపురం టౌన్: వైకేఎం రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు భాస్కరరావు

వాడవాడలా విశ్వావసు సందడి..

వాడవాడలా ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని ఇంటిల్లపాదీ తిని ఆస్వాదించారు. రైతులు తెల్లవారు జామునే లేచి కొత్త నాగళ్లతో పొలాలకు చేరుకుని ముహూర్తం ప్రకారం ఏరువాక చేపట్టారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించి పంచాంగ పఠనంలో పాల్గొన్నారు.

– పార్వతీపురం నెట్‌వర్క్


సీతానగరం: నీలకంఠాపురంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకుడు

వైభవంగా ఉగాది వేడుకలు


పంచాంగ పఠనం చేస్తున్న వేమకోటి నరహరి శాస్త్రి


చిన్నారుల నృత్యం


వేద పండితుడిని సత్కరిస్తున్న కలెక్టర్, తదితరులు


ప్రముఖ జ్యోతిష్యుడు మురపాక కాళిదాసు శర్మ యాజీని సత్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ


కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బెలగాం భీమేశ్వరరావును సత్కరిస్తున్న అధికారులు

- వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు
- 8 మంది అర్చక వేద పండితులకు సత్కారం

పార్వతీపురం టౌన్:

జిల్లా కేంద్రంలో ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కొత్త తెలుగు సంవత్సరంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వక్తలు ఆకాంక్షించారు. స్థానిక లయన్స్ కల్యాణ మంటపంలో నిర్వహించిన వేడుకలను కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణించిన 29 మందికి పురస్కారాలు అందజేశారు. అలాగే 8 మంది వేద పండితులను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్పీఎస్‌వీ మాధవ్‌రెడ్డి, మైలారపు సూర్య వెంకటరమణ, జేబీ తిరుమలాచార్యులు పాల్గొన్నారు.

పురస్కారాలు..

వివిధ రంగాల్లో రాణించిన వారికి కలెక్టర్, ఎస్పీ, తదితరులు ఉగాది పురస్కారాలు అందజేశారు. నారంశెట్టి ఉమామహేశ్వరరావు (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత), బెలగాం భీమేశ్వరరావు (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత), గంటేడ గౌరునాయుడు (సాహిత్యం), తాడ్డి సతీష్ కుమార్ (జర్నలిజం), గడగమ్మ రామకృష్ణ (శాంతి), శీర జయరాం (అర్జున్ అవార్డు గ్రహీత), బెహరా ఉమామహేశ్వరరావు (సాహిత్యం), బుడితి బలరాంనాయుడు (సాహిత్యం), డాక్టర్ వైవీ పద్మజ (వైద్యం, సంగీతం), పెంటపాటి సూర్యారావు (వినియోగదారుల క్లబ్), బొండపల్లి వెంకటరమణ (ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ), సంకా గౌరీ శంకరరావు (సామాజిక సేవ), మాదా కృష్ణమూర్తి (సామాజిక సేవ), రామస్వామి (సామాజిక సేవ), సూర్జ కాంతిగంటాయత్ (యోగా), కొమిరి కృష్ణమూర్తి (హెడ్ కానిస్టేబుల్), జేబీ తిరుమలాచార్యులు (వ్యాఖ్యానం), కనకల పైడిరాజు (క్రీడారంగం), డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు (ప్రకృతి వ్యవసాయం), గెంబలి గౌతమ్ (యువ శాస్త్రవేత్త, పార్వతీపురం), పల్లా పరిసినాయుడు (ప్రముఖ జాతీయ నఖచిత్ర కళాకారుడు), వెనిగండ్ల పద్మజ (జట్టు ఆశ్రమం నిర్వాహకురాలు), ఎ.లక్ష్మణరావు (ఆశా జ్యోతి ఆశ్రమం), బ్రహ్మశ్రీ మురపాక కాళిదాసు శర్మ (ఆధ్యాత్మిక రంగం), తదితరులు పురస్కారాలు అందుకున్నారు.

పండితులకు సత్కారం

దేవదాయ శాఖకు చెందిన వీరభద్ర స్వామి, (అర్చకుడు, సోమేశ్వరస్వామి ఆలయం, దేమునిగుంపా, కొమరాడ మండలం) బాలకృష్ణ పండా (అర్చకుడు, అభయ ఆంజనేయ స్వామి ఆలయం, కోన గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం), సింహదాటి శంకరరావు, (అర్చకుడు, కోదండరామాలయం, మరకొండ పుట్టి గ్రామం, మక్కువ మండలం), ధమరసింగు కనక లింగేశ్వరరావు (అర్చకుడు, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, కాశీపట్నం, మక్కువ మండలం), మండల చంద్రశేఖరరావు (అర్చకుడు, శ్రీ సీతారామ స్వామి ఆలయం, కుమ్మరిగుంట గ్రామం, వీరఘట్టం మండలం), పేరుమల్లా త్రినాథాచారి (అర్చకుడు, శ్రీ కోదండరామలయం, కోన గ్రామం, మక్కువ మండలం), సిద్ధాంతం చిరంజీవులు (అర్చకుడు, శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీపురం, పార్వతీపురం), శ్రీ జ్యోష్యుల వీరభద్రశర్మ (అర్చకుడు, వినాయక సమేత వీరంజనేయ స్వామి ఆలయం, బాసురు గ్రామం, పాలకొండ)లను ఘనంగా సత్కరించారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

ఉగాది సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది. సమ్మేళనంలో పాల్గొన్న చావలి శేషాద్రి సోమయాజులు, చింతా అప్పలనాయుడు, మీసాల వెంకట గౌరీశంకరరావు, ఇల్లా ప్రసన్నలక్ష్మి, మల్లిపూడి జగదీష్, గొట్టాపు శ్రీనివాసరావు, బౌరోతు శంకరరావు, కిలపర్తి దాలినాయుడు, గుడ్ల అమ్మాజీ, జమ్మ బాబురావు, పక్ల రోహిణీకుమార్, పొందూరు సుధాకుమార్, తదితరులను నిర్వాహకులు సత్కరించారు. అనంతరం శ్రావణి నృత్య పాఠశాల విద్యార్థులు, గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఏఎస్పీ అంకితా సురానా, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా అధికారులు ఎస్‌టీ నాయుడు, తమర్భ కొండలరావు, కె.చలపతిరావు, ఎ.మురళీధర్, టి. దుర్గాప్రసాద్ రెడ్డి, ఓ. ప్రభాకరరావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఆర్. కృష్ణవేణి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బీఎన్‌బీ రావు, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్.మంచిపల్లి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

సందర్శన..



పాచిపెంట మండల కేంద్రంలోని గిరిజన బాలికల మినీ గురుకుల పాఠశాలను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న వసతి సౌకర్యాలు, తదితర అంశాలపై ఆరా తీశారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎమ్ పోలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

– పాచిపెంట

ప్రమాదకర మలుపు..



బలిజిపేట నుంచి వంతరాం వెళ్లే రోడ్డులో ప్రమాదకర మలుపులున్నాయి. ముఖ్యంగా చిలకలపల్లి వద్ద ఉన్న మలుపు ప్రమాదాలకు పిలుపుగా మారింది. ఈ మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ఇబ్బంది పడుతున్న వాహన చోదకులకు రోడ్డుపై ఎండబెడుతున్న పంటలు మరో సమస్యగా మారాయి. ఏమాత్రం అలక్ష్యంగా ఉన్నా ప్రమాదం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు గాని, స్పీడ్‌బ్రేకర్లు గాని ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

– బలిజిపేట

ప్రారంభమైన జీడి పిక్కల కొనుగోళ్లు

గుమ్మలక్ష్మీపురం: మన్యంలో ఈ సీజన్లో లభ్యమయ్యే జీడి మామిడి పిక్కల కొనుగోలు ప్రారంభమైంది. ఇప్పుడిప్పుడే జీడి పిక్కలు దిగుబడి అవుతుండటంతో వాటిని సేకరించే పనిలో జీడి రైతులు నిమగ్నమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి పండుగ రోజైన ఆదివారం నుంచి స్థానిక వ్యాపారులు జీడిపిక్కలను కొనుగోలు ప్రారంభించారు. కిలో జీడి పిక్కలను రూ.150లుగా ధర నిర్ణయించి కొనుగోలు ప్రారంభించారు. పూత పిందె దశల్లో బాగున్నా.. దిగుబడులు మాత్రం ఈ ఏడాది ఆశాజనకంగా కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జీడి పిక్కలు

మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభం



మండలంలో మొక్కజొన్న పొట్టల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. పసుకుడి, సింగిడి, బిల్లుమడ, లివిరి, అనంతగిరి ప్రాంతాల్లో మొక్కజొన్న విస్తారంగా పండింది. దీంతో వ్యాపారులు నేరుగా ఆయా గ్రామాలకు చేరుకుని మొక్కజొన్న పొట్టలను కొనుగోలు చేస్తున్నారు. వీటి నుంచి గింజలు వేరుచేసి విత్తనాలు తయారుచేసి మళ్లీ విక్రయిస్తామని వ్యాపారులు చెబుతున్నారు. ఆదివారం పలు లారీల్లో మొక్కజొన్న పొట్టలు తరలించారు.

- భామిని



వేసవి దుక్కులతో కలుపు నివారణ

- లోతుగా దున్నడం వల్ల బహుళ ప్రయోజనాలు
- చీడపీడలు కూడా నివారించబడతాయి..

బలిజిపేట: రైతులు వేసవిలో దుక్కులను లోతుగా చేసుకుంటే కలుపును నివారించవచ్చు. అలాగే పంటల సాగులో జాగ్రత్తలు పాటిస్తే దిగుబడులు ఆశించిన స్థాయిలో ఉంటాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా ఒకే విధానంలో వ్యవసాయం చేయడం.. ఒకే రకమైన పంట వేయడం వల్ల భూసారం తగ్గిపోయే అవకాశం ఉంది. భూసారాన్ని బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. తొలకరి వర్షాలకు ముందుగా భూమిని లోతుగా దున్నడం వల్ల చీడపీడల నివారణకు భూమి సహకరిస్తుంది. భూమిలోపల ఉన్న సూక్ష్మజీవులు పైకి వచ్చి నశిస్తాయని, తద్వారా రైతులకు మేలు చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు.

వాలుకు అడ్డంగా..

వేసవి దుక్కులు వాలుకు అడ్డంగా లోతుగా చేపట్టాలి. ఈ విధంగా చేయడం వల్ల వర్షాలు పడినా భూమిలోని సారం బయటకు కొట్టుకుపోకుండా ఉంటుంది. పొలం గుల్లగా ఉండడం వల్ల వర్షాలు కురిసే సమయంలో ఆ నీరు భూమిలో ఇంకిపోతుంది. దీని వల్ల భూ అంతర్భాగంలో నీటి నిల్వలు చెక్కు చెదరవు. తేమను నిలుపుకునే సామర్థ్యం పెంచేందుకు దుక్కుల సమయంలో పశువుల పేడ చల్లి, ఎద్దులతో దున్నడం మంచి పద్ధతి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులు ఈ విధానంపై దృష్టి పెట్టాలి. మార్చి రెండో వారం నుంచి మే మొదటి వారం వరకు వేసవి దుక్కులకు అనుకూలం. రానున్న ఖరీఫ్‌కు సంబంధించి ఇప్పటి నుంచే రైతులు వేసవి దుక్కులు చురుగ్గా చేపడుతున్నారు.

చీడపీడలు అంతరించిపోతాయి..

లోతుగా భూమిని దున్నడం వల్ల భూమికి నష్టపరిచే కీటకాలు, గుడ్లు, శిలీంధ్రాలు, చీడపీడ కారకాలు బయటపడి అంతరించిపోతాయి. అలాగే భూమి అడుగు భాగాన ఉన్న గడ్డి మూలాలు కూడా నాశనమవుతాయి. దుక్కుల వల్ల భూమి వదులుగా మారి వర్షం కురిసినప్పుడు గాలి, నీరు, ఉష్ణోగ్రత సమానంగా ఇంకిపోయి విత్తనాలు మొలకెత్తడానికి అనుకూలంగా ఉంటుంది. దుక్కుల అనంతరం ఎకరాకు రెండు టన్నుల చొప్పున పశువుల ఎరువు పొలంలో చల్లుకోవాలి. దీంతో పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు కూడా సమృద్ధిగా అందుతాయి.

ఎన్నో లాభాలున్నాయి..

రానున్న ఖరీఫ్‌కు సిద్ధపడే రైతులు వేసవి దుక్కులు చేపట్టుకోవడానికి వాతావరణం అనుకూలంగా ఉంది. భూమిని లోతుగా దున్నడం వల్ల గుల్ల బారి భూసారి పెరుగుతుంది. ఇదే సమయంలో చీడపీడలు నశిస్తాయి. ఏ పంటలు సాగు చేయాలనుకున్న వారైన దుక్కులు మాత్రం లోతుగా చేపట్టుకోవడం మంచిది.

– శ్రావణకుమార్ నాయుడు, ఏఓ బలిజిపేట

వైభవంగా గోవిందమ్మ పేరంటాల జాతర

వీరఘట్టం: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న అచ్చెపువలస వద్ద వెలిసిన గోవిందమ్మ పేరంటాల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినం సందర్భంగా యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతరకు వీరఘట్టంతో పాటు సమీప గ్రామాల ప్రజలు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి బిస్కెట్లు నైవేద్యంగా సమర్పించడం ఇక్కడి ఆచారం. దీంతో భక్తులు కొబ్బరికాయ, అరటిపళ్లతో పాటు బిస్కెట్లను కూడా అమ్మవారికి సమర్పించారు. బోగాది అప్పారావు భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఐ అశోక్‌కుమార్

రాజాం: విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ బొద్దాం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు రూపొందించిన తెలుగు నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. పట్టణ సీఐ అశోక్‌కుమార్ చేతులమీదుగా క్యాలెండర్ విడుదల చేసి, పలువురికి అందజేశారు. త్రిమత ఏకైక గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన తెలుగు కాలసూచికలోని ఎన్నో భగవద్గీత వచనాలను ఈ క్యాలెండర్‌లో జోడించి ఇవ్వడం జరిగిందన్నారు. తెలుగు నెలలు అనుసరించుటకు వీలుగా తెలుగు తిథులతో ఇంగ్లిష్ తేదీలను కూడా పొందుపరిచినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎం.రామినాయుడు, రామకృష్ణ, సూరపునాయుడు, లక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.